క్లుప్తంగా

ఒర్రెలో ఇరుక్కున్న వాహనం



ఒర్రెలో ఇరుక్కున్న ఐచర్ వాహనం

వాంకిడి: శనివారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. ఖమాన గ్రామం మధ్యలోని ఒర్రెపై గల లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలోనే మహారాష్ట్ర వైపు నుంచి నాలుగు కొత్త ఐచర్ వాహనాలు టోల్‌ప్లాజా తప్పించుకునేందుకు ఖమాన గ్రామం మీదుగా వచ్చాయి. మూడు వాహనాలు ఒర్రెను దాటగా మరో వాహనం అదుపుతప్పి ఒర్రెలో ఇరుక్కుంది. సుమారు 5 గంటల పాటు శ్రమించి వాహనాన్ని బయటకు తీశారు.

దాడి కేసులో ఇద్దరి రిమాండ్

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన రాచకొండ కృష్ణపైన దాడి చేసిన ఇద్దరిని రిమాండ్‌కి తరలించినట్లు ఎస్సై కొమురయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల ప్రకారం బాధితుడు రాచకొండ కృష్ణ శనివారం సాయంత్రం ఇంటికి వస్తున్న క్రమంలో ప్రధాన రహదారిపైన ఎల్కపల్లి గ్రామానికి చెందిన ఘనపురం వాసుదేవ్, ఘనపురం రాజ్‌కుమార్‌లు అడ్డుకుని దాడి చేశారు. దాడిలో రాచకొండ కృష్ణ తల, దవడలపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు కృష్ణను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి భార్య రాచకొండ సారిక ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై కొమురయ్య

పెంచికల్‌పేట్: వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్య అన్నారు. మండలంలోని కమ్మర్‌గాం గ్రామంలో ఆదివారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వరదలు సంభవించిన సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ నేరాలు, సీపీఆర్‌పైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మధునయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

తిర్యాణి: మండలంలోని గడలపెల్లి గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సుంగాపూర్ గ్రామానికి చెందిన సాయికుమార్, పవన్ అనే ఇద్దరు యువకులు పని నిమిత్తం మండల కేంద్రానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో పంగిడిమాదర వైపు నుంచి తిర్యాణి వైపునకు వస్తున్న గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఎదురుగా ఢీకొట్టింది. దీంతో సాయి కుమార్, పవన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి తరలించినట్లు పీహెచ్‌సీ వైద్యుడు అక్షిత్ తెలిపారు.

7న జెండాలు ఎగురవేయాలి



మాట్లాడుతున్న థామస్

కెరమెరి: ఎస్సీ వర్గీకరణ సాధించుకున్న నేపథ్యంలో జూలై 7న ఉదయం 10 గంటలకు ప్రతీ గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాలు ఆవిష్కరించాలని సంఘం జిల్లా ఇన్‌చార్జి గుండా థామస్ మాదిగ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో గద్దెలు నిర్మించాలని 30 ఏళ్ల ఎస్సీల వర్గీకరణ పోరాటంలో ఎందరో ప్రాణత్యాగాలు చేశారన్నారు. వారిని గుర్తుచేసుకుంటూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు మహేశ్, వెంకటేశ్, గోగర్ల రాజయ్య, సంతోష్, రాంచందర్, పరదేశి, అశోక్, తిరుపతి, సాయికుమార్, ఆకాశ్, గణేశ్ తదితరులు ఉన్నారు.

ఇంద్రానగర్.. దుర్గంధ భరితం



ఇది ఇంద్రానగర్ వెనుక గల్లీలో గల మురికి కాలువ పరిస్థితి. డ్రెయినేజీలో నీరు నిల్వ ఉండడంతో నాచు తేలి మురుగు నీరంతా పచ్చరంగులోకి మారిపోయింది. దీంతో ఆ ప్రాంతం గుండా వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



ఇది ఇంద్రానగర్ కాలనీ ముందు వరుస గల్లీలో కాలువ దుస్థితి. సర్వీస్ రోడ్డుకు ఆనుకుని సైడ్ డ్రెయిన్ ఎత్తు ఎక్కువ ఉండటంతో మురుగు నీరు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో దుర్గంధం వెదజల్లుతూ దోమలకు ఆవాసంలా మారింది. అదే గల్లీలో మరో వైపు అసలుకే కాలువ లేకపోవడంతో నివాసాలు, బోరింగుల నుంచి వచ్చే వృథా నీరు రోడ్డుపై పారుతోంది.



ఇది సర్వీస్ రోడ్డుకు పక్కనే ఇంద్రానగర్‌లోని నివాసాల మధ్య పేరుకుపోయిన చెత్త కుప్ప. గత కొన్ని రోజులుగా చెత్తను తొలగించకుండా వదిలేశారు. దీంతో పిచ్చి మొక్కలు సైతం పెరుగుతున్నాయి. చెత్తతో దోమలు మాత్రమే కాకుండా విష సర్పాలు, కీటకాలు ఆవాసం చేసుకునే ప్రమాదం ఉందని, నివాసాల మధ్యలో ఇలా ఉండటంతో కాలనీవాసులు ఆందోళనకు గురవుతున్నారు.

- ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు
- నిండుగా మురికి కాలువలు
- ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు



ఖమాన గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన చెత్త

వాంకిడి: మండల కేంద్రంలోని ఇంద్రానగర్ కాలనీలో మురికి కాలువల నిర్వహణ లేక గల్లీల్లో దుర్వాసన వెదజల్లుతోంది. కాలువలు చెత్తాచెదారం పేరుకుపోయి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. అటు వైపుగా వెళ్లాలంటే దుర్గంధం భరించలేక ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొన్ని గల్లీల్లో కాలువలు లేకపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. వర్షాలు కురిసిన ప్రతీసారి రోడ్లన్నీ జలమయమై చెరువులను తలపిస్తాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఇళ్లలో నుంచి వచ్చే వృథా నీరు రోడ్లపైకి చేరి పారిశుద్ధ్యం లోపిస్తుంది. చెత్త కుప్పలు సైతం తొలగించకపోవడంతో అపరిశుభ్రత చోటు చేసుకుంటుంది. పారిశుద్ధ్యం లోపించి దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని, వ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కాలనీవాసులు చెబుతున్నారు. మురికి కాలువలు, సీసీ రోడ్లు నిర్మించాలని గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోతుందని, ప్రతీ వర్షాకాలంలో మురుగు నీరు ఇళ్లలోకి చేరుతుందని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అధ్వానంగా రోడ్లు..

- ఇంద్రానగర్ కాలనీ పరిధిలోని ఖమాన గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో చెత్తకుప్ప పేరుకుపోయింది. గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టింపులేకుండా వ్యవహరిస్తుండటంతో అపరిశుభ్రత నెలకొంది. చెత్తకుప్ప రోజురోజుకు పెరుగుతూ రహదారి మీదకు వస్తుంది. పక్కనే ఉన్న మురికి కాలువలో మొక్కలు పెరిగి అధ్వానంగా మారాయి.
- ఇంద్రానగర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాల వెనకాల గల్లీకి వెళ్లే సీసీరోడ్డు అధ్వానంగా ఉంది. మురికి కాలువలు లేకపోవడంతో ఇళ్లలో నుంచి వచ్చే వృథా నీరు రోడ్డుపైనే పారుతుంది. గత కొన్ని సంవత్సరాల నుంచి ఇలాగే ఉన్నా పట్టించుకునే వారు లేరని స్థానికులు తెలుపుతున్నారు. మురికి కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.

ఇళ్లలోకి మురుగునీరు



మా గల్లీలో మురికి కాలువలు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇళ్లలో నుంచి వచ్చే వృథా నీరు రోడ్డుపై పారుతోంది. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోంది. భారీ వర్షాలు కురిస్తే మురుగు నీరంతా ఇళ్లలోకి చేరుతుంది. అధికారులు దృష్టి సారించాలి.

– మునార్కార్ రాజేశ్వర్, ఇంద్రానగర్‌కాలనీ

సీసీరోడ్డు నిర్మించాలి



మా కాలనీలోని పలు గల్లీల్లో సీసీరోడ్లు లేకపోవడంతో వర్షాలు కురిసిన ప్రతీసారి రోడ్లు జల మయమవుతున్నాయి. మురికి కాలువల నిర్వహణ సైతం సరిగ్గా లేదు. మురికి నీరంతా నిల్వ ఉంటుంది. తీవ్రంగా దుర్గంధం వెదజల్లుతుంది. చెత్తకుప్పలు పేరుకుపోయాయి. అధికారులు కాలనీలో అభివృద్ధి పనులతో పాటు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలి.

– హమీద్, ఇంద్రానగర్‌కాలనీ

'భుజాడి మల్లేశ్ మృతి పార్టీకి తీరనిలోటు'



మల్లేశ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

బెజ్జూర్: బీజేపీ నాయకుడు భుజాడి మల్లేశ్ మృతి పార్టీకి తీరని లోటని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని పాపన్‌పేట్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు భుజాడి మల్లేశ్ ఇటీవల మృతిచెందారు. ఆదివారం నిర్వహించిన పెద్దకర్మ కు ఎమ్మెల్యే హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. మండల అధ్యక్షుడు జాడి తిరుపతి, మాజీ సర్పంచ్ వసీ ఉల్లాఖాన్, సామల తిరుపతి, జాడి దిగంబర్, మాజీ ఉపసర్పంచ్ తిరుపతి, విలాస్, రంగన్న, శ్యామ్‌సుందర్, రమేశ్, రంగయ్య, శేఖర్, మాంతయ్య తదితరులు ఉన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



నిందితుడు, పత్తి విత్తనాలతో పోలీసులు

వాంకిడి: మహారాష్ట్ర నుంచి ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆదివారం ఆర్టీసీ చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, బస్సులో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని తనిఖీ చేశామన్నారు. ఈ క్రమంలో మహారాష్ట్రకు చెందిన వినోద్ వద్ద రూ.20 వేల విలువైన ఏడు కిలోల నకిలీ పత్తివిత్తనాలు లభించినట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్సై పోశెట్టి, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చడి మెతుకులూ భారమే!

వేడివేడి అన్నంలో మామిడి కాయ పచ్చడి కలిపి నోట్లో పెడితే ఆహా.. ఆ రుచే వేరు.. చెప్తుంటేనే నోరూరితుంది కదూ.. ఆగండి అలా నోరూరించకండి..! వాటి తయారీకి ఉపయోగించే సరుకుల ధరలు వింటే నోరూరడం కాదు కదా.. నోటి నుంచి మాట కూడా రాదు. ధరలు అంతగా మండిపోతున్నాయి మరి. – కెరమెరి

- పచ్చళ్ల తయారీకి ధరల పోటు



మామిడి పచ్చడిని మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్న ప్రజలు

ప్రతీ ఇంట్లోనూ నిత్యం కనిపించే పచ్చళ్లు ఈసారి ఖరీదయ్యాయి. పచ్చళ్ల తయారీలో ఉపయోగించే అన్ని సరుకుల ధరలకు రెక్కలొచ్చాయి. కారంపొడి, జీలకర్ర, మెంతులు, ఆవాలు, ధనియాలకు తోడు మామిడి కాయల ధరలు చుక్కలంటుతున్నాయి. నోరూరించే ఆవకాయ ప్రస్తుతం సామాన్యులకు ఆర్థికంగా భారమైంది. ఏపూట కాపూట సర్దుకునే పేదకుటుంబమైనా.. ఆర్థికంగా స్థితి మంతులైనా సరే.. ప్రతీ ఇంట్లో పచ్చడి ఉండాల్సిందే. ప్రతీ ఒక్కరు అన్నంతతో పాటు ఆవకాయ ఆరగించాల్సిందే. కొందరు పేదలు పచ్చడితోనే పూట గడిపేస్తుంటారు. రైతులు ఏడాదికి సరిపడేంత పచ్చళ్లు తయారు చేసుకుంటారు. అయితే ఈసారి పచ్చళ్ల తయారీకి వాడే వస్తువుల ధరలు పెరగడంతో తొక్కుల తయారీ పేద, మధ్యతరగతి వర్గాలను నిట్టూరుస్తున్నాయి. అసలే దిగుబడులు తక్కువగా ఉన్న మామిడి కాయలు అకాల వర్షం, ఈదురు గాలులకు రాలిపోయాయి. దీంతో మామిడి కాయలు ధరలకు డిమాండ్ ఏర్పడింది. ఒక్క కాయ రూ. 10 నుంచి రూ. 12లు పలుకుతుంది. రిటైల్ మార్కెట్‌తోపాటు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, కెరమెరి, జైనూర్, వాంకిడి, తిర్యాణి తదితర మండల కేంద్రాల్లో కొనసాగే వారసంతల్లోనూ ధరలు మండిపోతున్నాయి.

ధరలకు రెక్కలు..

తొక్కుల తయారీలో జీలకర్ర, ఆవాల పొడి, మెంతులు, ధనియాల పొడి, కారంపొడి, ఉప్పు, పల్లినూనె వాడుతారు. జీలకర్ర ధర కిలో రూ.350, మెంతులు రూ.100, ధనియాలపొడి రూ. 150, కారం పొడి రూ. 250, నూనె లీటరు రూ.140లకు చేరింది. కుటుంబానికి సరిపడే పచ్చడి తయారీలో గతంలో రూ. 2వేల లోపు ఖర్చయ్యేది. ప్రస్తుతం పెరిగిన ధరలతో రూ. 3 వేల నుంచి రూ.3500 వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇంట్లో తయారీ కష్టమే..



పచ్చడి తినే అలవాటు ఉంది. కానీ పెరిగిన ధరలతో ఇంట్లో పచ్చడి తయారు చేయడం కష్టంగా మారింది. దీంతో మార్కెట్‌లో లభించే పచ్చడినే కొనుగోలు చేయడం అనివార్యమైంది. పచ్చడి తయారీకి ఉపయోగించే జీలకర్ర ధరతో పాటు ఆవాలు, మిరియాలు ఇతరత్రా ధరలు బాగా పెరిగాయి.

– పాతాడే మేఘ, గృహిణి, కెరమెరి

హైలెవల్ వంతెనలు నిర్మించరూ..!



ఇది మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో గల ఒర్రె. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు ఒర్రె ఉప్పొంగి ప్రవహించడంతో గంటపాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఉంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యను ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.



ఇటీవల అల్లిగూడ గ్రామ శివారులోని లోలెవల్ వంతెనపై నుంచి పారుతున్న నీరు

- ఏటా వర్షాకాలంలో మునుగుతున్న లోలెవల్ వంతెనలు
- గ్రామాలకు నిలిచిపోతున్న రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న మండలవాసులు

లింగాపూర్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లలో లోలెవల్ వంతెనలు ఉండడంతో వానాకాలంలో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు ఒర్రెలు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో వంతెనల పై నుంచి నీరు పారుతుంది. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఎవరైనా వాగులు దాటే క్రమంలో గల్లంతు కావడం, వంతెనలు కోతకు గురికావడం, రోడ్లు తెగిపోవడం వంటి ఘటనలు జరిగినప్పుడు ప్రజాప్రతినిధులు పర్యటించి హైలెవల్ వంతెనల నిర్మాణాలకు హామీలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో మండలవాసులకు ఏటా వరద కష్టాలు తప్పడం లేదు.

సమస్యల్లో గ్రామాలు..

ఓ మోస్తారు వర్షం కురిసినా లోలెవల్ వంతెనలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరదనీటి ప్రవాహంతో వాగులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పలు గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. అసలే అంతంతమాత్రం మౌలిక వసతులున్న గ్రామాలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో ఆయా గ్రామాల ప్రజల తిప్పలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మండలంలోని అనేక గ్రామాల్లో వర్షాకాలంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు కోతకు గురవుతుండడం, పలు గ్రామాలకు వంతెనలు లేకపోవడం, మరికొన్ని గ్రామాలకు మట్టిరోడ్లే దిక్కవడం వంటి సమస్యలు కలుగుతున్నాయి.

- మండలంలోని జాముల్‌ధర గ్రామపంచాయతీ పరిధిలోని మారుగూడ, నాగుగూడ గ్రామాలకు వెళ్లే రహదారిలో శిథిలావస్థకు చేరిన లోలెవల్ వంతెన ఉంది. వర్షాకాలంలో అధికంగా వానలు పడితే రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ఉపాధ్యాయులు కూడా పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. ఆయా గ్రామాల ప్రజలు కూడా నిత్యావసర సరుకుల కోసం వానలు తగ్గి వరద ప్రవాహం తగ్గేవరకు వేచి చూడని పరిస్థితి ఉంది.
- వర్షాకాలంలో నద్దంగూడ, మామిడిపల్లి, వంజారీగూడ, పిక్లాతండా, నిమ్మతండా, హీరాపూర్, కొత్తపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు, వంతెనలు కోతకు గురవుతున్నాయి.
- మోతీపటార్, పిట్టగూడ, గుమ్నూర్, కంచన్‌పల్లి జీపీలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై ఉన్న ఒర్రెలు, వాగులకు వంతెనలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- జాముల్‌ధర గ్రామం నుంచి పంగిడిమాదుర గ్రామం వరకు 20కి పైగా అనుబంధ గిరిజన గ్రామాలకు సరైనా బీటీ రోడ్డు లేక వానాకాలంలో మట్టిరోడ్డుతో వాహనదారులు తిప్పలు పడుతున్నారు.
- లింగాపూర్ మండల కేంద్రం నుంచి పిట్టగూడ గ్రామానికి వెళ్లే రహదారి సమీపంలోని బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరై ఆరు నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించలేదు.

ఎటూ వెళ్లలేని పరిస్థితి



మా గ్రామ సమీపంలోని ఒర్రెపై లోలెవల్ వంతెన ఉంది. భారీ వర్షాలు కురిసిన ప్రతీసారి గ్రామం జలమయమవుతుంది. అత్యవసర సమయాల్లో ఎటూ వెళ్లలేని పరిస్థితి ఉంది. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులను తీసుకెళ్లడానికి ఒక్క వాహనం కూడా రాదు. అధికారులు చొరవ తీసుకుని లోలెవల్ వంతెనల నిర్మాణాలు చేపట్టాలి.

– జాదవ్ రవీందర్, పట్కల్‌మంగి

నిర్మాణాలు చేపట్టాలి..



మండలంలోని లోలెవల్ వంతెనలు, బ్రిడ్జీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రతీ ఏడాది భారీ వర్షాల కారణంగా రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రజల రాకపోకలకు, నిత్యావసర సరుకులు, ఆసుపత్రులకు వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు హైలెవల్ వంతెనల నిర్మాణాలు చేపట్టాలి.

– ఆదే సురేశ్ నాయక్, బీజేపీ మండలాధ్యక్షుడు

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నార్నూర్: పిడుగుపడి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడం తీవ్రంగా కలిచివేసిందని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆదివారం గాదిగూడ మండలంలోని పిప్రి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతి చెందిన మంగం భీంబాయి కూతురితో మాట్లాడారు. వారి కుటుంబసభ్యులు, బంధువులకు ఆమెకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి కాంట్రాక్ట్ ఉద్యోగం ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయ పనులకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ స్తంభాలు, నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో నిలబడవద్దన్నారు. బీఆర్ఎస్ నాయకులు మర్సుకోల సరస్వతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్, ఫాక్స్ చైర్మన్ ఆడే సురేశ్, ఫాక్స్ డైరెక్టర్ కాంబ్లే ఉద్ధవ్, మాజీ సర్పంచ్ మాడవి జాకు, పూసం బాదిరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'రైతుభరోసా' ప్రారంభం

కౌటాల: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రైతుభరోసా పథకం ప్రారంభిస్తుందని మండల వ్యవసాయాధికారి ప్రేమలత ఆదివారం తెలిపారు. పథకం ప్రారంభ కార్యక్రమంలో భాగంగా సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడనున్నారు. కౌటాల, సాండ్‌గాం, మొగడ్‌దగడ్ రైతువేదిక భవనాల్లో వీడియో కాన్ఫరెన్స్ కోసం ఏర్పాట్లు చేశారు. మండలంలోని రైతులు కార్యక్రమాన్ని హాజరు కావాలని ఆమె కోరారు.

పొలాల్లోకి వెళ్లి.. పలకలు ఇచ్చి



పలకలు అందజేస్తున్న రాజేశ్వర్

కెరమెరి: బడిబాటలో భాగంగా ఆదివారం మండలంలోని జోడేఘాట్ ఆశ్రమ పాఠశాలకు చెందిన హెచ్ఎం ఆత్రం మోతిరాం, పాఠశాల చైర్మన్ పెందోర్ రాజేశ్వర్ పొలాల్లోకి వెళ్లి విద్యార్థులకు పలకలు అందజేశారు. జోడేఘాట్ పరిసర ప్రాంతాల్లోని అలీగూడ, గోగెన్‌మోవాడ్, వాడిలొద్ది, దెమ్మిడిగూడ, రింగన్‌ఘాట్, ఆడదస్నాపూర్ తదితర గ్రామాలతో పాటు పొలాల్లోకి వెళ్లి పాఠశాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.